సాక్షి
కుమురం భీం
సోమవారం, 14, అక్టోబర్, 2024



జోడేఘాట్‌లో మహారాష్ట్ర వాసులు

కుమురంభీం వర్ధంతి సందర్భంగా మహారాష్ట్రలోని చంద్రాపూర్, యవత్‌మాళ్ జిల్లాల ప్రజలు ఆదివారం జోడేఘాట్‌కు తరలివచ్చారు. 9లో▸

సీసీ కెమెరాల ఏర్పాటు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ కుమురం భీం మ్యూజియంలో ఆదివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న సీసీకెమెరాల స్థానంలో నూతన కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో కేవలం 7 ఉండగా ప్రస్తు తం 24 ఏర్పాటు చేశారు. మ్యూజియం, ప్ర ధాన గేటు వద్ద, కుమురం భీం ప్రతిమ, స్మృతివనం తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /22.0

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుంది'



పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన: రాష్ట్ర ప్రజలు కోరుకున్న ప్రజాపాలనను కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. శనివారం బీఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు అంబేడ్కర్‌తో పాటు గోలేటికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కాలంలో డీఎస్సీతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కాంగ్రెస్ పార్టీ పనితీరును నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ప్రశంసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, ఎర్రం తిరుపతి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆందోళనలు ఉధృతం చేస్తాం'

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం మిల్లు యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిషోర్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలో లారీ యజమానులు, డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ పోరాటం న్యాయబద్ధమైందని, యాజమాన్యం, కార్మికులు, మేధావులు, నాయకులతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. యాజమాన్యం స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దివస్



నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్ష భూమి వద్ద శనివారం విజయదశమి పురస్కరించుకుని దమ్మచక్ర పరివర్తన్ దివస్ కార్యక్రమం జై భీమ్ సేన ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్, గౌరవ అధ్యక్షుడు అశోక్, సుధాకర్, రవిదాస్, నితిన్ పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి

- కనుల పండువగా వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న 'రావణ దహనం'



జిల్లా కేంద్రంలో రావణ దహనం నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లాలో భక్తులు శనివారం వైభవంగా విజయదశమి జరుపుకున్నారు. పండుగ నేపథ్యంలో ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని శిర్డీ సాయి మందిర్, కేస్లాపూర్ హనుమాన్ మందిర్ ఆవరణలో పెద్ద ఎత్తున వాహన పూజలు నిర్వహించారు. మార్కండేయ ఆలయం, కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వద్ద అర్చకులు శిరీష్ శర్మ, డిల్లీ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శమీపూజ నిర్వహించారు. విజయదశమి సందర్భంగా శ్రీరామ చంద్రుని ఎంపిక కోసం బంగారం లక్కీ విజేత ఎంపికను భక్తుల సమక్షంలో నిర్వహించారు. శ్రీరామచంద్రుడిగా ఆసిఫాబాద్‌కు చెందిన రాపర్తి నర్సింహస్వామి ఎంపికై రావణాసుర దహనం చేశారు. అనంతరం కేస్లాపూర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 10 తలల రావణాసుర వధ నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, బీజేపీ జిల్లా నాయకుడు అరిగెల నాగేశ్వర్ రావు పాల్గొని శమీ వృక్ష పూజ, విజయదశమి ప్రాముఖ్యత వివరించారు. ఉదయం జిల్లాకేంద్రంలోని వివేకానంద చౌక్ వద్ద పండుగ సామగ్రి, పూల దుకాణాల వద్ద సందడి కన్పించింది. బంతి పూలు, గుమ్మడి కాయలతో పాటు వాహనపూజకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు.

ఆకట్టుకున్న ఆర్కెస్ట్రా..

దసరా ఉత్సవాల్లో భాగంగా కేస్లాపూర్ హనుమాన్ ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిలువేరు వెంకన్న, ఆలయ కమిటీ ప్రతినిధులు ధర్మపురి వెంకటేశ్వర్లు, డాక్టర్ రూప్‌నర్ రమేశ్, వెంకన్న, శ్రీనివాస్, రాజశేఖర్, వివేక్, లక్ష్మణమూర్తి, మధూకర్, మురళీగౌడ్, రాధాకృష్ణ, ప్రహ్లాద్, కోట వెంకన్న, గోపాల్‌నాయక్, తిరుపతి, వెంకటేశం, నారాయణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిమందిరంలో..

జిల్లా కేంద్రంలోని సాయి మందిరంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అర్చకులు ఇందారపు మధూకర శర్మ, సాయి శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఏటా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా సాయి బాబా ఉత్సవ విగ్రహాలతో పట్టణంలో బ్యాండ్ మేళాతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి భక్తులు జోలె భిక్ష చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తాటిపెల్లి రమేశ్, ముక్త సురేశ్, రాచర్ల లచ్చన్న, అశోక్, గంధం వినోద్, రావుల దిలీప్, నాందేవ్, భక్తులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో శమీ వృక్షానికి పూజలు చేస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

గోలేటి టౌన్‌షిప్‌లో..

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు శనివారం దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి పురస్కరించుకుని సింగరేణి గోలేటి టౌన్‌షిప్‌లో, మండల కేంద్రంలో శమీ వేడుకలు నిర్వహించారు. కోదండ రామాలయం ఆధ్వర్యంలో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలతో భీమన్న స్టేడియం వరకు పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భీమన్న స్టేడియంలో జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోలేటి, రెబ్బెన మండల కేంద్రాల్లో రాంలీలా మైదానంలో రావణ దహన కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అశేష భక్తజనం నడుమ దశకంతుడు రావణబ్రహ్మ బొమ్మను కాల్చి ప్రజలు సంబరాలు చేసుకున్నారు. జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: దసరా ఉత్సవ వేడుకలను శనివారం కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై రావనదాహనం, జమ్మిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్ బాబు దంపతులతో పాటు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో జమ్మిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మురళీధర్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో సాయినాథుడి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర



రెబ్బెన: గోలేటిలో జమ్మిచెట్టు వద్ద శమీ పూజలు చేస్తున్న జీఎం శ్రీనివాస్



కాగజ్‌నగర్‌రూరల్: రావణ దహనం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, డీఎస్పీ రామానుజం



కాగజ్‌నగర్‌లో రావణదహనం నిర్వహిస్తున్న భక్తులు

అభివృద్ధే అంతిమ లక్ష్యం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: రాజకీయాలకు అతీతంగా సిర్పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే అంతిమ లక్ష్యమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. శనివారం దహెగాం మండలం లగ్గాం గ్రామ సమీపంలోని పెద్దవాగుపై అదనపు బ్రిడ్జి నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి కృషితోనే వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్ల సీఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. లగ్గాం నుంచి కల్వాడ గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణ, గుత్తేదారులు జగన్, ప్రవీణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండలాధ్యక్షుడు మధుకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో ఉద్రిక్తత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఓ వర్గానికి చెందిన యువతి పట్ల మరో వర్గానికి చెందిన యువకులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహించిన మరో వర్గం వారు అవతలి వర్గానికి చెందిన జ్యూస్ సెంటర్ ధ్వంసం చేసారు. పరిస్థితి ఉద్రిక్తకరంగా మారడంతో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి ఇరువర్గాలను చెదరగొట్టారు. సుమారు మూడు గంటల పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఇరువర్గాలు బైఠాయించి ఆందోళన చేపట్టడంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ తెలిపారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీక

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఆయుధ పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకొని, మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్‌లో వాహనపూజ, ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ నిర్వహించుకుంటామన్నారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ఠ భద్రత చర్యలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్, ఆర్‌ఐలు పెద్దయ్య, అంజన్న, ఆర్‌ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల్లో జోడేఘాట్

- తప్పని తాగునీటి కటకట
- రోడ్డు సౌకర్యం కరువు
- ఇంకా పూర్తికాని 'డబుల్' ఇళ్లు



జోడేఘాట్ గ్రామం

కెరమెరి(ఆసిఫాబాద్): జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన ఆదివాసీ వీరుడు కుమురం భీం పుట్టినగడ్డ జోడేఘాట్ సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అక్కడ కుమురం భీం వర్ధంతిని అధికారంగా నిర్వహిస్తున్నప్పటికీ గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలో మొత్తం 50 కుటుంబాలు ఉండగా, 270 మంది నివసిస్తున్నారు. కానీ వారికి కనీస సౌకర్యాలు లేక తిప్పలు పడుతున్నారు. గత ప్రభుత్వం గ్రామంలో 30 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇప్పటి వరకు కేవలం మూడు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5.04 లక్షలు మంజూరు చేసింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి మరో రూ. 2.20 లక్షలు పెంచింది. అయినా పనులు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి.

కరెంట్ ఉంటేనే తాగునీరు..

గ్రామానికి మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికీ ఆ నీటిని గ్రామస్తులు తాగడం లేదు. నీరు కలుషితంగా ఉంటుందని కాలకృత్యాలు, స్నానాలు, బట్టలు ఉతకడం వంటి పనులకు మాత్రమే వినియోగిస్తున్నారు. గ్రామంలో ఉన్న ఒకే ఒక చేతిపంపు గ్రామానికి సుమారు 500 మీటర్ల దూరంలో ఉంది. ఒకే బోరు ఉండగా, కరెంట్ ఉంటేనే పని చేస్తుండడంతో విద్యుత్ లేని సమయంలో తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆదివాసీలు వాపోతున్నారు.

కంకర తేలిన రోడ్డు..

గత ప్రభుత్వం హయాంలో సుమారు రూ.6 కోట్లతో హట్టి నుంచి జోడేఘాట్ వరకు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. జోడేఘాట్ నుంచి టోకెన్‌మోవాడ్ వరకు 15 కిలోమీటర్ల బీటీ వేసినప్పటికీ టోకెన్‌మోవాడ్ నుంచి హట్టి వరకు రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రిజర్వు ఫారెస్టు కావడంతో అటవీ అధికారులు పనులను అడ్డుకున్నారు. దీంతో గడిచిన ఐదేళ్ల నుంచి గ్రామస్తులు రాళ్లు, రప్పలు, గుంతలు, కంకర తేలిన రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కాగా జోడేఘాట్ నుంచి ఆసిఫాబాద్ మండలంలోని వావుదాం మీదుగా జిల్లా కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్లు ఉంటుంది. కానీ జోడేఘాట్ నుంచి వావుదం వరకు ఉన్న 4 కిలోమీటర్ల రోడ్డు గుట్టలతో నిండి ఉంది. దీంతో జోడేఘాట్ నుంచి వావుదం వరకు రోడ్డు వేయాలని అధికారులను స్థానికులు వేడుకుంటున్నా ప్రయోజనం ఉండడం లేదు. దీంతో జోడేఘాట్ నుంచి జిల్లాకేంద్రం చేరడానికి కెరమెరి మీదుగా సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

అన్ని రకాల వనమూకలు జోడేఘాట్‌లో తయారు కావాలని 2017లో 29వేల మొక్కలు నాటారు. నాటిన తొలి ఏడాదిలోనే అనేక రకాల మొక్కలు నిర్జీవమయ్యాయి. సుగంధద్రవ్యాల కోసం కొంత భాగంలో ప్రత్యేకంగా మనిషి ఆకారాన్ని తయారు చేసి అందులో వివిధ రకాల మొక్కలు నాటారు. దాని పక్కనే లోటస్‌పాండ్‌ను కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలు కళకళలాడుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇతర ప్రాంతాల్లో నాటిన మొక్కలు పెరగక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.

సందర్శకులకూ తిప్పలు

జోడేఘాట్‌ను సందర్శించే పర్యాటకుల కోసం ప్రత్యేక సత్రాలు ఏర్పాటు చేస్తామని, హోటళ్లు నిర్మిస్తామని గత ప్రభుత్వం చెప్పినా అమలు కాలేదు. మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులకు కనీసం మినరల్ వాటర్ కూడా లభించని పరిస్థితి ఉంది. టూరిజం స్పాట్ ఏర్పాటు చేసినప్పటికి ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో సందర్శకులు, ఆదివాసీలు నిరుత్సాహానికి గురవుతున్నారు. సేద తీరడానికి కూడా ఎలాంటి సౌకర్యం లేక చెట్ల కింద సేదతీరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జోడేఘాట్‌లో ఏళ్లుగా నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలి. ఐదేళ్ల నుంచి అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. తాగునీటికి, రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. జోడేఘాట్ నుంచి వావుదాం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– పెందోర్ రాజేశ్వర్, చైర్మన్, కుమురం భీం ఉత్సవ కమిటీ

సౌకర్యాలు కల్పించాలి



జోడేఘాట్‌కు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలి. ఎలాంటి వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా సత్రాలు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– పెందోర్ మోతీరాం, కన్వీనర్, కుమురంభీం ఉత్సవ కమిటీ



పిచ్చిమొక్కలతో లోటస్ పాండ్



నిలిచిన రోడ్డు నిర్మాణం

గంగమ్మ ఒడికి దుర్గమ్మ!

- భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జనం
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గత తొమ్మిది రోజులుగా పూజలందుకున్న దుర్గామాత ఆదివారం గంగమ్మ ఒడికి చేరింది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వాసవి మందిర్, రావులవాడ, పైకాజీనగర్, కంచుకోట, బాపునగర్, బ్రాహ్మణవాడ, సంఘసేవా, సాయిదుర్గామాతతో పాటు శారదా మండలి(బాపునగర్), ఇతర కాలనీల్లోని దుర్గామాత విగ్రహాల నిమజ్జనం చేపట్టారు. వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారిని డీజే చప్పుళ్లు, బ్యాండు మేళాలతో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో మహిళలు, యువతులు, చిన్నారులు ఆడిన దాండియా ఆటలు, కోలాట నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం దుర్గామాత విగ్రహాలను పెద్దవాగులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైరాగడే మనోజ్, పుల్లూరి రవీందర్, అశ్విన్, పిన్నా వివేక్, ఏకిరాల సుగుణాకర్, చిలువేరు వెంకన్న, బాలేశ్‌గౌడ్, శ్రీనివాస్, ఇరుకుల మంగ, మహేందర్, ఆనంద్, రజనీ, శిరీష, దేవేంద్ర, ప్రతాప్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: శారదామాత విగ్రహాన్ని పెద్దవాగులో నిమజ్జనం చేస్తున్న భక్తులు

రెబ్బెనలో..

రెబ్బెన: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు భక్తులు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా దుర్గామాత విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాలపై నిలిపి శోభాయాత్ర నిర్వహించారు.

ఇందిరానగర్‌లో భక్తుల తాకిడి..

మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. శనివారం రాజరాజేశ్వరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా, అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్‌తో పాటు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని పల్లకిలో నిలిపి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ పూజారి దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రెబ్బెన: ఇందిరానగర్‌లో దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ దండె విఠల్



రెబ్బెన: అమ్మవారి పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు



ఆసిఫాబాద్: నృత్యం చేస్తున్న యువతులు, మహిళలు

క్లుప్తంగా

ఆలయంలో చోరీ

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారు నల్ల పోచమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు చొరబడి రెండు తులాల వెండి విగ్రహంతోపాటు ఇత్తడి నవగ్రహాలు, రూ.30 వేల విలువ గల అమ్మవారి చీరలను ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి మెడలో వెండి పుస్తెలతాడు, హారం ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గూడెంలో ఇరువర్గాల దాడి

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామంలో శనివారం దసరా పండుగ రోజున రెండు వర్గాల మధ్య దాడులు జరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఓ కానిస్టేబుల్‌ను కూడా వారు తోసేసినట్లు సమాచారం.ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా, రెండు వర్గాలు గొడవపడుతున్న ట్లు తెలియగానే అక్కడికి వెళ్లి అడ్డుకున్నాం. దానిపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

రోడ్డుప్రమాదంలో పాత్రికేయుడికి గాయాలు

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు ఎనుగంటి రాంచందర్ శనివారం రాత్రి బైక్‌పై నిర్మల్ నుంచి సారంగాపూర్ వస్తున్నాడు. సాయినగర్ వద్ద బతుకమ్మ నిమజ్జనం చేసి ఇంటికి వెళ్తున్న మహిళలను చీకట్లో సరిగా కనిపించక పోవడంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాంచందర్‌కు తీవ్రగాయాలవగా.. సాయినగర్‌కు చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో క్షతగాత్రులను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం రాంచందర్‌ను వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైంది. శనివారం దసరా పండుగ సందర్భంగా తన అమ్మమ్మకు బంగారం (జమ్మి)పెట్టి వస్తానని ఇంట్లో చెప్పి రాత్రి సమయంలో బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి టూటౌన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

చకచకా వర్ధంతి ఏర్పాట్లు



చదును చేస్తున్న పార్కింగ్ స్థలం

కెరమెరి: ఈ నెల 17న కుమురం భీం 84వ వర్ధంతి పురస్కరించుకొని మండలంలో పనులు చకచకా సాగుతున్నాయి. ఆదివారం హెలీప్యాడ్ సిద్ధం చేశారు. గతంలో ఉన్న హెలీప్యాడ్ సమీపంలోనే రైతు కంచె నిర్మాణం చేయడంతో హెలీక్యాప్టర్ దిగేందుకు అనువుగా లేకుండా పోయింది. దీంతో అధికారులు నూతన స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వాహనాలు నిలిచేందుకు పార్కింగ్ స్థలాన్ని పోలీసులు చదును చేయిస్తున్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ఆందోళన బాట

- నేటి నుంచి నిరవధిక బంద్‌కు యాజమాన్యాల నిర్ణయం
- ఫీజుల చెల్లింపులో ప్రభుత్వ తాత్సారంపై నిరసన


ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
మంచిర్యాల	15
ఆదిలాబాద్	22
నిర్మల్	26
కుమురంభీం	05

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఆందోళన బాట పట్టాయి. మూడేళ్లుగా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు నిరవధిక బంద్ చేయాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. దసరా సెలవులు ముగిసినప్పటికీ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి నుంచి కళాశాలలు మూసివేసి నిరసన చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 68 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు తెరుచుకునే పరిస్థితి కినిపించడం లేదు.

ఫీజుల చెల్లింపులో తాత్సారం..

ఆర్థిక కారణాలతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావొద్దనే ఉద్దేశంతో 2008లో అప్పటి ప్రభుత్వం బోధన రుసుముల చెల్లింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు కోర్సుల రుసుములు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందులో ఎంటీఎఫ్–మెయింటనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీ విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుంది. రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ (ఆర్‌టీఎఫ్) కళాశాలలకు చెల్లించే ఫీజు ఆయా యాజమాన్యాల ఖాతాల్లో జమఅవుతుంది. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం కళాశాలలకు చెల్లించడంలో తాత్సారం జరుగుతూ వస్తోంది. దీంతో కళాశాలల నిర్వహణ భారంగా మారి ఉద్యోగుల జీతాలు, భవనాల అద్దె, రోజువారి ఖర్చులు, కరెంట్ బిల్లులు, మున్సిపల్ ట్యాక్స్, ఇతర బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొందని యాజమాన్యాలు వాపోతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులను దశలవారీగా కలిసినప్పటికీ ఫలితం లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో నిరవధిక బంద్‌కు వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కళాశాలలు ముద్రించిన ఫ్లెక్సీ

బిల్లులు చెల్లించేంత వరకు..

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు పెండింగ్ బిల్లులు చెల్లించేంత వరకు నిరవధిక బంద్ కొనసాగిస్తాం. మూడేళ్లుగా (ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్) ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూపాయి కూడా చెల్లించలేదు. తొమ్మిది నెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అద్దెభవనాలు, అధ్యాపకుల వేతనాలు, ఇతర బిల్లులు చెల్లించకలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కళాశాలలు మూసి ఉంచుతాం.

– ఎస్వీ రమణ, టీపీడీఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

మాలలంతా ఏకతాటిపైకి రావాలి



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఆదిలాబాద్‌రూరల్: మాలల సంఖ్య తగ్గించే కుట్ర జరుగుతోందని, ఈ మేరకు కులస్తులంతా ఏకతాటిపైకి రావాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో ఆదివారం మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మాలలు తక్కువ సంఖ్యలో ఉన్నారంటూ కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వర్గీకరణ విషయంలోనూ ఇలానే మోసం జరిగిందని తెలిపారు. తెలంగాణలో 30 లక్షల మాల జనాభా ఉందని పేర్కొన్నారు. కులస్తులంతా ఐక్యంగా ఉండి సత్తా చాటే సమయం ఆసన్నమైందన్నారు. నవంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే మాలల గర్జనకు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇందులో సమత సైనిక్ దళం జాతీయ కార్యదర్శి దిగంబర్ కాంబ్లే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల రవీందర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, సుధాకర్, ప్రభాకర్, సుధీర్, రాజేశ్వర్, దేవన్న పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమాల మయం..’

కైలాస్‌నగర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. జిల్లా కేంద్రానికి ఆదివారం వచ్చిన ఆయన ప్రజాసేవ భవన్‌ను సందర్శించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్న పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. దాన్ని గాడిన పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను ఆదిలాబాద్ ప్రాంతంలో పర్యటించానని, అమరవీరుల కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం చేసినట్లు గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్, కౌన్సిలర్లు సతీష్, శ్రీనివాస్, తిరుపతి, ఆశమ్మ, ప్రేమల తదితరులు పాల్గొన్నారు.

మహా సరస్వతీగా అమ్మవారు



మహాసరస్వతీ అలంకారంలో అమ్మవారు

బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం చివరిరోజు అమ్మవారు ‘మహా సరస్వతీ’గా దర్శనమిచ్చింది. అదేవిధంగా విజయదశమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి పల్లకిసేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని పెట్టి ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులు శమీ ఆకులను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో విజయరామారావు ఏర్పాట్లు చేశారు. – బాసర

ఇస్రోను వదిలి.. ఏఎంవీఐకి

- ఉద్యోగాల సాధనలో రెబ్బనపల్లి యువకుడి ప్రతిభ



ఏఎంవీఐ ఉద్యోగానికి ఎంపికైన కొట్టె మధుకర్

దండేపల్లి(మంచిర్యాల): కష్టాలను అధిగమిస్తూ ప్రతిభకు పదునుపెట్టి, ప్రభుత్వ కొలువుల సాధనలో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లికి చెందిన కొట్టె మధుకర్. ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా ఇప్పటి వరకు మూడు ఉద్యోగాలు సాధించాడు. రైల్వేలో, లోకోపైలెట్ ఉద్యోగం సాధించి దానికి వెళ్లకుండా అంతరిక్షమే స్ఫూర్తిగా ఇస్రోలో టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆ ఉద్యోగం చేస్తూనే యూనిఫాం ఉద్యోగం చేయాలన్నా కోరికతో ప్రస్తుతం రాష్ట్ర రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

కష్టాల కడలి నుంచి..

రెబ్బనపల్లికి చెందిన కొట్టె తిరుపతి, పద్మ దంపతులకు మమత, మధుకర్ సంతానం. మధుకర్ చిన్ననాటి నుంచి చదువులో ముందుండేవాడు. అయితే అతని చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. దీంతో తల్లి, అక్క, ఇద్దరు కూలీ పనులకు వెళ్తూ చదివించారు. పాఠశాల సెలవు రోజుల్లో కూడా మధుకర్ కూలీ పనులు చేసేవాడు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తన చదువును సాగించాడు. 2015లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పాసయ్యాడు. పాలిసెట్‌లో ప్రతిభ కనబర్చి, నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ డిప్లమా పూర్తి చేశాడు. 2018లో బీటెక్ చేసేందుకు ప్రవేశ పరీక్ష రాసి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సీటు సాధించాడు. అదే సమయంలో రైల్వేలో లోకో పైలెట్ ఉద్యోగం వచ్చింది. దానికి వెళ్లకుండా బీటెక్ పూర్తిచేశాడు. 2022లో ఇస్రోలో టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అది చేస్తూనే యూనిఫాం ఉద్యోగం చేయాలన్నా తన చిన్ననాటి కోరికతో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షకు హాజరయ్యాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)ఉద్యోగం సాధించాడు. ఇస్రోలో తాను చేస్తున్న టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాన్ని వదులుకొని తనకు ఇష్టమైన యూనిఫాం ఉద్యోగానికి వస్తున్నట్లు మధుకర్ తెలిపాడు. వరుస ఉద్యోగాల పరంపర కొనసాగిస్తున్న యువకుడిని పలువురు అభినందిస్తున్నారు.

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం



రథోత్సవంలో పాల్గొన్న భక్త జనం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర ఆలయంలో దసరా పురస్కరించుకొని మండల హిందూ ఉత్సవ సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాసుని కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవాన్ని స్థానిక ఆలయం నుంచి బ్రాహ్మణ వాడ, డౌనల్ ప్రాంతం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా శ్రీనివాసుని నామస్మరణతో మార్మోగింది. అనంతరం సిర్పూర్(టి) వాగులో రావణాసుర దహన కార్యక్రమం నిర్వహించారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్, సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దివస్



భైంసాలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలో శనివారం దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో దమ్మ చక్రపరివర్తన్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలతో ర్యాలీ తీయగా యువత నృత్యాలతో సందడి చేశారు. అనంతరం బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ అవినాశ్‌కుమార్ హాజరవగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో బౌద్ధ మహాసభ, నేతకాని మహర్ సంఘం నాయకులు దమ్మ చక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నేతలు పంచరంగుల జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ, నేతకాని మహర్‌సేవా సంఘం, బహుజన సేవా సంఘాల నాయకులు దుర్గం సిద్ధార్థ రాంమ్మూర్తి, స్వామి, రత్నం బాబురావు, దుర్గం శాంతారావు, లక్ష్మి చరణ్, చరణ్‌దాస్, రాంచందర్, జాడి రాజే, రాము, పాగిడి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పనులకు ప్రభుత్వ వాహనం!

- పెట్రోలింగ్ పేరుతో అటవీశాఖ సిబ్బంది జల్సా?
- పార్కింగ్ చేసిన వాహనాన్ని ఢీకొట్టిన ‘ఫారెస్ట్’ వెహికిల్
- దాబా వద్ద వాగ్వాదం



దాబా వద్ద వాహనాన్ని ఢీకొట్టిన ఫారెస్ట్ వెహికిల్

ఇచ్చోడ: అటవీశాఖ సిబ్బంది ప్రైవేట్ పనులకు ప్రభుత్వ వాహనాలను వినియోగించడం చర్చనీయాంశంగా మారింది. మండలకేంద్రంలోని ఓ దాబా వద్ద శనివారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో అటవీశాఖలో పనిచేసే సెక్షన్ అధికారితో పాటు డ్రైవర్ ప్రభుత్వ వాహనంలో వచ్చి భోజనం చేశారు. తిరిగి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అక్కడే పార్కింగ్ చేసిన మరో వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టాడు. దీంతో పార్కింగ్ చేసిన వాహన యజమాని, అటవీశాఖ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న ఉద్యోగి మద్యం తాగి ఉన్నట్లు పార్కింగ్ చేసిన వాహన యజమానితో పాటు ఆయన మిత్రులు ఆరోపించారు. వాహన మరమ్మతుకు డబ్బులు ఇస్తేగాని కదలనీయమని అటవీశాఖ వాహనాన్ని అడ్డుకున్నారు. డబ్బులు ఇచ్చేంత వరకు తన బైక్‌ను వారి వద్దే ఉంచుకోమని వాహనంలో ఉన్న ఉద్యోగి అనడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయమై ఎఫ్ఆర్వో పుండలిక్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా.. విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. సిబ్బంది ఎన్ని గంటలకు పెట్రోలింగ్ చేస్తారని ప్రశ్నించంగా ఆ విషయాలు బయటకు చెప్పమని సమాధానమిచ్చారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

తిర్యాణి: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తీగల మాధవ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగి పంచాయతీ పరిధి కొలంగూడ గ్రామానికి చెందిన టేకం రాజుబాయి(43) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండేది. రెండేళ్ల క్రితం ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె దిగాలుగా ఉండేది. జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు టేకం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో గల మందోట వద్ద సింగిల్ ఫేజ్ విద్యుత్ స్తంభానికి అమర్చిన ఎర్తింగ్ వైర్‌కు తగిలి గేదె శనివారం మృతి చెందింది. దీని విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు అంగోతు తానాజీ తెలిపాడు. అధికారుల నిర్లక్ష్యంతోనే గేదె మృతిచెందిందని బాధిత రైతుకు పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

దొరికిన బంగారం అప్పగింత



బంగారం అప్పగిస్తున్న ఉత్సవ సమితి నాయకులు

ఖానాపూర్: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి దొరికిన రెండు తులాల బంగారు ఆభరణాన్ని హిందూ ఉత్సవ సమితి నాయకులు బాధితుడు గుమ్ముల అశోక్ కు ఆదివారం అందజేశారు. వేడుకల కు హాజరైన అశోక్ పాగొట్టుకున్న బంగారు గొలుసు హిందూ ఉ త్సవ సమితి నాయకులకు దొరికింది. దీంతో బంగారాన్ని ఉత్సవ సమితి సభ్యులు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజ్యం సురేశ్, కార్యదర్శి శెట్టి శ్యాం, తుమ్మనపెల్లి లక్ష్మణ్, కృష్ణస్వామి, దివాకర్, నిమ్మల సాయి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుమన్, అశోక్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు కాంస్యం



కాంస్య పతకం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

మంచిర్యాలటౌన్: ఈనెల 9 నుంచి 11వరకు రంగారెడ్డి జిల్లా తొర్రూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా మహిళల జట్టు వరంగల్ జట్టుతో పోరాడి తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శనివారం మంచిర్యాలకు వచ్చిన జట్టుకు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ స్వాగతం పలికారు. క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, జాతీయ రెఫరీ కళ్యాణ్,తదితరులు సన్మానించారు.

రోటోవేటర్‌లో ఇరుక్కుని రైతు మృతి



రమేశ్ మృతదేహం

సారంగపూర్: మండలంలోని ఆలూరుకు చెందిన రైతు దేశెట్టి రమేశ్(42) ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారిపడి రోటోవేటర్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం..రమేశ్ తన పంటపొలంలో ఆదివారం ట్రాక్టర్‌తో రోటోవేటర్ సహాయంతో దుక్కి దున్నుతున్నాడు. అయితే రోటోవేటర్ సక్రమంగా పనిచేయకపోవడంతో వెనక్కి తిరిగి రోటోవేటర్ లివర్‌ను లాగేక్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారిపడ్డాడు. అప్పటికే ట్రాక్టర్ పరుగు పెడుతుండడంతోపాటు రోటోవేటర్ పనిచేస్తుండగా అందులో ఇరుక్కుని మృతిచెందాడు. సమీప రైతులు గమనించి రమేశ్‌ను బయటకు తీయగానే అక్కడికక్కడే చనిపోయాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ఏడేళ్ల కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన పోలీసు బొర్రన్న (54) బైక్‌పై దిలావర్‌పూర్‌కు వెళ్తున్నాడు. సిర్గాపూర్ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బొర్రన్న తలకు తీవ్ర గాయమైంది. అంబులెన్స్ వచ్చేసరికి అప్పటికే మృతిచెందాడు. ఏఎస్సై భీంరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కార్మికుడు..

బెల్లంపల్లి: పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొని ఆదివారం రాత్రి సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం ... మందమర్రి ఏరియా కాసిపేట గనిలో పనిచేస్తున్న కామశెట్టి కిరణ్ కుమార్ (42) బెల్లంపల్లి మండలం చాకేపల్లికి చెందిన సహచర కార్మికుడి ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి హాజరయ్యాడు. కార్యక్రమం అనంతరం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై తన స్వస్థలం రామకృష్ణాపూర్‌కు వెళ్తుండగా డివైడన్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..



సాహెబ్‌రావ్ (ఫైల్)

తానూరు: పండుగ పూట విషాదం నెలకొంది. మండల కేంద్రానికి చెందిన వాగ్మారే సాహెబ్‌రావ్ కాలకృత్యాల కోసం చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతిచెందాడు. ఎస్సై డి.రమేశ్ కథనం ప్రకారం.. వాగ్మారే సాహెబ్‌రావ్ (40) కుటుంబ సభ్యులతో కలిసి శనివారం గ్రామ సమీపంలోని డాంగ్‌పల్లిలోని భవాని ఆలయానికి వెళ్లాడు. పూజల అనంతరం సమీపంలోని చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి కాలు జారిపడి మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. భార్య కల్పన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.